ఎలాంటి భర్త కావాలంటే..

అతిలోక సుందరి శ్రీదేవి కూతురుగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన జాన్వీకపూర్ వరుస సినిమాలతో బిజీగా ఉంటున్నది. జూనియర్ ఎన్టీఆర్ హీరోగా తెరకెక్కుతున్న 'దేవర'లో హీరోయిన్‌గా టాలీవుడ్‌లోకి అరంగేట్రం చేస్తున్నది. ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలైన జాన్వీ ఫస్ట్ లుక్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. అంతేకాదు.. హీరో రామ్‌చరణ్, ఉప్పెన దర్శకుడు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాల్లో కూడా హీరోయిన్‌గా ఎంపికయిందీ అభినవ అతిలోక సుందరి. ప్రస్తుతం 'మిస్టర్ అండ్ మిసెస్ మహీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించడానికి రెడీ అయింది. ఈ సినిమా ప్రమోషన్లలో కాబోయే భర్త ఎలా ఉండాలనే ప్రశ్న ఎదురైంది జాన్వీకి. దానికి ఈ ముద్దుగుమ్మ ఏం చెప్పిందో తెలుసా..? నా కలలను కూడా తన కలలుగా భావించేవాడు భర్తగా కావాలంటూ మనసులో మాటను బయటపెట్టింది జాన్వీ. 'నాకు ఎప్పుడూ అండగా ఉండాలి. నేను సంతోషంగా ఉండేలా చూసుకోవాలి. నవ్విస్తూ ఉండాలి. నేను ఏడుస్తుంటే పక్కనే ఉండి ధైర్యం చెప్పాలి' అని కాబోయే వాడి గురించి చెప్పుకొచ్చిందీ భామ. తన స్నేహితుడు శిఖర్ పహాడియాతో ఈ బ్యూటీ డేటింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ తిరుమల శ్రీవారిని జంటగా పలుమార్లు దర్శించుకున్నారు. అంతేకాదు, తిరుమలలోనే పెండ్లి చేసుకుంటామని జాన్వీ ఇప్పటికే వెల్లడించింది కూడా.

నమస్తే తెలంగాణ

జిందగీ

12

హైదరాబాద్ | ఆదివారం 19 మే 2024 www.ntnews.com

బొమ్మల బాహుబలి

క్రౌన్ ఆఫ్ బ్లడ్

ఓటీటీ హిట్

డిస్నీ హాట్‌స్టార్: మే 17
దర్శకులు: జీవన్ జె కాంగ్, నవీన్ జాన్

తెలుగు సినిమాకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన సినిమా బాహుబలి. ఇండియన్ సినిమాలకు టాలీవుడ్ స్టామినాను రుచి చూపించిన ఈ సినిమా ఇప్పుడు వెబ్ సిరీస్ రూపంలో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే ఈసారి యానిమేటెడ్ వెర్షన్‌లో ప్రేక్షకులను మెప్పించడానికి రెడీ అయ్యింది. బాహుబలి సినిమాకు దర్శకత్వం వహించిన దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి.. ఈ యానిమేటెడ్ వెర్షన్‌కు ఒకానొక నిర్మాతగా వ్యవహరించారు. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో పలు భాషల్లో అందుబాటులోకి వచ్చిందీ మూవీ.

కథ: మాహిష్మతి సామ్రాజ్యం చుట్టుపక్కల ఉన్న రాజ్యాలను ఆక్రమిస్తూపోతున్నాడు రక్తదేవ్ అనే క్రూరుడైన రాజు. అలా మాహిష్మతి సామ్రాజ్యాన్ని కూడా ఆక్రమించుకోవాలని భావిస్తాడు. ఆ రక్తదేవ్‌ను బాహుబలి, భల్లాలదేవ కలిసి ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అయితే, ఈ కథలో బాహుబలికి భిన్నంగా మాహిష్మతిని సొంతం చేసుకోవాలని భావించే రక్తదేవ్‌కు విధేయుడిగా పనిచేస్తాడు కట్టప్ప. అది ఈ కథలోని ఆసక్తికర అంశం. అసలు రక్తదేవ్ ఎవరు? ఈ కథలో ఆయన పాత్ర ఏంటి? రక్తదేవ్ పక్కన కట్టప్ప ఎందుకు ఉన్నాడు? బాహుబలి, భల్లాలదేవ కలిసి తమ సామ్రాజ్యాన్ని కాపాడుకున్నారా? అనే విషయాలు తెలియాలంటే మాత్రం ఈ సిరీస్ చూడాల్సిందే.

ఎలా ఉందంటే..

బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు అనే ప్రశ్న ప్రేక్షకుల్లో ఎంత ఆసక్తిని రేకెత్తించిందో.. ఈ యానిమేటెడ్ సిరీస్‌లో కూడా కట్టప్ప క్యారెక్టర్ అంత ఇంపాక్ట్‌ను క్రియేట్ చేస్తుంది. బాహుబలి, రక్తదేవ్ మధ్య వచ్చే కొన్ని సన్నివేశాలు సిరీస్‌పై ఆసక్తిని పెంచుతాయి. ఇక, బాహుబలి పేరు వినగానే గుర్తొచ్చేది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్. ఈ యానిమేటెడ్ సిరీస్‌లో బాహుబలి లుక్స్ పర్వాలేదనిపిస్తాయి అంతే. డబ్బింగ్ కూడా అంతగా ఆకట్టుకోదు. అయితే, బాహుబలి సినిమాకు ఉన్న క్రేజ్‌తో ఈ సిరీస్ చూస్తే నిరాశ తప్పదు. దర్శకుడు జీవన్ జె కాంగ్, నవీన్ జాన్ ఎంతో కష్టపడి ఈ ఔట్‌పుట్ తీసుకొచ్చారని చెప్పాలి. బాహుబలి యానిమేటెడ్ వెర్షన్ భారీ అంచనాలతో ఓటీటీలో విడుదలైన 'బాహుబలి: క్రౌన్ ఆఫ్ బ్లడ్ బాగానే ఉంది. అంచనాలు పెట్టుకోకుండా చూస్తే ఈ వేసవిలో పిల్లలు, పెద్దలు ఎంజాయ్ చేయొచ్చు.

అదే చివరి మాట

1994లో ఇండస్ట్రీలో అడుగుపెట్టి.. తనదైన నటనతో ఎన్నో నేషనల్ అవార్డులు, ఫిల్మ్‌ఫేర్ అవార్డులను గెలుచుకున్నారు మనోజ్ బాజ్‌పాయ్. హిందీతోపాటు తెలుగు, తమిళ భాషల్లో సినిమాలు చేసిన మనోజ్.. ఇటీవల మీడియాతో మాట్లాడుతూ తన జీవితంలో జరిగిన అత్యంత విషాద సంఘటనను పంచుకున్నారు.

''ఆ రోజు నేను 'కిల్లర్ సూప్' వెబ్‌సిరీస్ సెట్స్‌లో ఉన్నాను. నా సోదరి ఫోన్ చేసి నాన్న జీవితం పూర్తయినట్టేనని చెప్పింది. డాక్టర్లు మాత్రం నాన్న ఇంకా ఈ ప్రపంచంలో ఉన్నారని చెప్పారు. నాన్నకూ, నాకు మధ్య మంచి అనుబంధం ఉండేది. అందుకే నాన్నకు ఫోన్ చేసి 'నాన్నా.. నొప్పి భరించింది చాలు.. అందరినీ వదిలేసి వెళ్లిపోయే సమయం వచ్చేసింది.. ప్లీజ్ వెళ్లిపో..' అని చెప్పా. నేనలా మాట్లాడిన తర్వాతి రోజు తెల్లవారుజామునే నాన్న మరణించారు. నాన్నతో నేను ఆ మాటలు చెప్పినప్పుడు వ్యాన్‌లో బాయ్ ఉన్నాడు. నా మాటలు విన్న బాయ్ విపరీతంగా ఏడ్చేశాడు. ఆ రోజులు చాలా కష్టంగా గడిచాయి. నా గొంతు విన్న తర్వాత మనసు తేలికపడటంతో నాన్న ఆనందంగా తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించారనే వార్త విన్న తర్వాత నాకు కన్నీళ్లు ఆగలేదు. అదే నా జీవితంలో అత్యంత విషాద సంఘటన'' అని చెప్పుకొచ్చారు మనోజ్ బాజ్‌పాయ్.

అంత తేడా ఎందుకో..

మహేశ్‌బాబు నటించిన 'వన్: నేనొక్కడినే' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమైంది కృతిసనన్. అనంతరం బాలీవుడ్‌లో సినిమాలు చేస్తూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఈ ఏడాది ప్రారంభంలో బాలీవుడ్ స్టార్ హీరో షాహిద్ కపూర్‌తో కలిసి 'తేరీ బాతో మే ఐసా ఉల్జా జియా' సినిమాలో నటించింది. అనంతరం టబు, కరీనా కపూర్‌తో కలిసి 'క్రూ' చిత్రం చేసింది. ఈ రెండు సినిమాలూ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి. ఈక్రమంలోనే ఈ అమ్మడు 'పే పారిటీ'పై తన అభిప్రాయాల్ని పంచుకున్నది.

ఇండస్ట్రీలో నటీనటుల రెమ్యునరేషన్లలో తేడాలు (పే పారిటీ) ఎందుకు ఉంటాయో ఇప్పటికీ అర్థం కాదు. 10 సంవత్సరాలుగా ఒక్క హిట్ కూడా ఇవ్వని నటుడికి 10 రెట్లు ఎక్కువ రెమ్యునరేషన్ చెల్లిస్తారు. హీరోయిన్ల విషయంలో అది భిన్నంగా ఉంటుంది. నటీనటుల రెమ్యునరేషన్లలో వ్యత్యాసం అనేది సరైనదే అనే ఉద్దేశంలో నిర్మాతలు ఉన్నారు. డిజిటల్, శాటిలైట్ రైట్స్ ద్వారా సినిమా బడ్జెట్ చాలావరకు రికవర్ అవుతున్నది. సినిమా విడుదలకు ముందే నిర్మాతలు సేఫ్ జోన్‌లోకి వచ్చేస్తున్నారు. హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాలతో పోలిస్తే హీరో ప్రధానంగా తెరకెక్కిన సినిమాలు మెరుగైన ఓపెనింగ్స్ రాబడతాయి. రెమ్యునరేషన్లలో తేడాలు అనేవి ఇక్కడి నుంచే మొదలవుతాయని అనుకుంటున్నాను' అని చెప్పుకొచ్చింది కృతిసనన్.